క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందిస్తున్న సర్పంచ్ శైలజ

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం మద్దులూరులో కాకునూరి దేవేంద్రమ్మకు స్థానిక సర్పంచ్ మైనం శైలజ చేతుల మీదుగా రూ.60 వేల విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును శుక్రవారం స్థానిక సచివాలయం వద్ద అందించారు. కీళ్ల మార్పిడి చేయించుకున్నందుకు వైద్యఖర్చుల నిమిత్తం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ బోడెంపూడి శ్రీనివాసరావు, మైనం అమర్‌నాథ్, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా పరిరక్షణ సభను విజయవంతం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

నాగులుప్పలపాడు: సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా పరిరక్షణ భేరి బస్సు యాత్ర ఈ నెల 7వ తేదీ సంతనూతలపాడులో జరగనుందని, విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు జయంత్‌బాబు, షేక్ మాబు కోరారు. శుక్రవారం నాగులుప్పలపాడులో ఈ బస్సు యాత్రకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించి మాట్లాడారు.

శిక్షణ పూర్తి చేసిన వారికి ఉపాధి



శిక్షణ పొంది సర్టిఫికెట్లు అందుకున్న మహిళలు

చీమకుర్తి: సూయింగ్ మిషన్ ఆపరేటర్లుగా శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు శుక్రవారం సంతనూతలపాడులోని మహిళా ప్రాంగణంలో సర్టిఫికెట్లు అందించారు. స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఆర్.లోకనాథం శిక్షణ పూర్తి చేసుకున్న వారికి పలు ప్రైవేటు కంపెనీల యజమానులతో మాట్లాడి ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలు కల్పించారు. సూయింగ్ మిషన్ ఆపరేటర్లుగా మహిళా ప్రాంగణంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారి టీ భరద్వాజ్ మాట్లాడుతూ శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

పుష్కార్టులకు మరమ్మతులు చేయించాలి



అధికారులకు సమస్యలు తెలియజేస్తున్న కార్మికులు

ఒంగోలు టౌన్: నగరపాలక సంస్థలో పనిచేసే పారిశుధ్య కార్మికులు రోజువారీ వినియోగించే పుష్‌కార్టు చక్రాలు పనిచేయకపోవడంతో కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే మరమ్మతులు చేయించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నగర వర్కింగ్ కార్యదర్శి శ్రీరాం శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ అధికారులను కలిసి ఆ మేరకు విజ్ఞప్తి చేశారు. నాలుగు నెలలకు ఒకసారి పనిముట్లకు మరమ్మతులు చేయించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.బాలకృష్ణ, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

వరుణుడి కరుణతో రైతుల ఆనందం



వర్షానికి జలమయమైన బ్యాంకు వీధి

కురిచేడు: వరుణుడు కరుణించడంతో రైతుల్లో ఆనందం వెల్లి విరిసింది. మండలంలో శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి పంటలు కాపాడుకోవచ్చని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు సరైన వర్షం కురవకపోవడంతో రైతులు కొన్ని పంటలు మాత్రమే సాగు చేయగలిగారు. ఈ వర్షంతో పప్పుశనగ సాగు చేయవచ్చని, సాగు చేసిన కంది, పొగాకు, పత్తి పంటలను కాపాడుకునేందుకు అవకాశం లభించిందన్నారు. మెట్ట పంటలకు ప్రాణం పోసినట్లయిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని వీధులు జలమయమయ్యాయి. లోతట్టు ఇళ్లల్లోకి నీరు చేరింది. వర్షపు నీటికి మురుగు నీరు చేరి మూడు అడుగుల లోతు నీరు నిలిచిపోయింది.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- కొత్తపట్నం స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి



సమావేశంలో చర్చిస్తున్న ఎంపీపీ అంజిరెడ్డి, అధికారులు, ఎంపీటీసీలు

కొత్తపట్నం: పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి అధికారులకు సూచించారు. కొత్తపట్నంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం స్టాండింగ్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. సహజ వనరుల యాజమాన్య కార్యాచరణ కమిటీ సభ్యులు, మౌలిక సదుపాయాల కార్యాచరణ కమిటీ సభ్యులు, మానవ వనరుల యాజమాన్య కార్యాచరణ కమిటీ సభ్యులతో చర్చించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలుపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు దృష్టి సారించాలని కోరారు. ప్రకృతి వ్యవసాయం కిట్లు ఎన్ని ఇచ్చారని అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయం గురించి సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు తెలియజేయాలని వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డికి సూచించారు. మత్స్యశాఖ పథకాలు, ఇన్సూరెన్స్ గురించి వేటకు వెళ్లే ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించి ప్రమాదం జరిగితే బీమా వర్తించేలా చూడాలని ఎఫ్‌డీవో ఆషాను కోరారు. జాతీయ లైవ్ స్టాక్ మిషన్ పథకం ద్వారా ఔత్సాహిక రైతులు, నిరుద్యోగులకు ప్రోత్సాహం కోసం లోన్లు ఇస్తున్నట్లు చెప్పారు. రూ.10 లక్షల నుంచి రూ.4 కోట్ల వరకు లోన్లు ఇస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్ఆర్ఈజీఎస్ కూలీలతో మండలంలోని అన్ని గ్రావెల్ రోడ్లకు మార్జిన్లు, షోల్డర్లు వేయించాలని ఏపీవో రత్నజ్యోత్స్నను ఆదేశించారు. కొత్తపట్నంలో డీడీ, డీటీ, చాకిరేవుమిట్ట కాలనీల్లో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయిలు మంజూరు అంశం తీర్మానాలు ఇవ్వక ఆగిపోయిందన్నారు. సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ సెంటర్లు, జేజేఎం పురోగతి గురించి చర్చించారు. సీసీ రోడ్లు, డ్రెయిన్లు పూర్తి చేయాలని కోరారు. జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి మాట్లాడుతూ రైతులంతా ఈ క్రాప్ చేయించుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అప్పుడే పంటల బీమా, పంట నష్టపరిహారం, జీరో వడ్డీ, పంట రుణాలు, కౌలు రైతుల సంక్షేమం వంటి ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. వ్యవసాయ శాఖ ఏవో మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ క్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలని, ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. సమావేశంలో డాక్టర్ వైష్ణవి, ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, ఈవోఆర్డీ ఏ బాల చెన్నయ్య, వైస్ ఎంపీపీలు శెట్టి కోటేశ్వరమ్మ, తాతా ఉమమహేశ్వరి, ఎంపీటీసీలు మిట్నసల శాంతారావు, పురిణి వెంకట్రావు, చలంచర్ల తిరుపతమ్మ, పీఆర్ ఏఈ శేషారావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందిపై కమిషనర్ ఆగ్రహం



బలరాం కాలనీ సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: వార్డు సచివాలయాల పరిధిలో మూమెంట్ రిజిష్టర్ వాడని సిబ్బందిపై నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని 3వ డివిజన్‌లో శుక్రవారం ఆయన పర్యటించారు. బలరాంకాలనీతో పాటు డివిజన్ పరిధిలోని పోతురాజు కాలువ పరిసరాలను పరిశీలించారు. తొలుత బలరాంకాలనీ వార్డు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు రిజిష్టర్‌ను పరిశీలించారు. సిబ్బంది అందరూ మూమెంట్ రిజిష్టర్ ఎందుకు వాడటం లేదని నిలదీశారు. రిజిష్టర్ వాడని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఏకరూపు దుస్తులు ధరించకుండా విధులకు హాజరవుతున్న సిబ్బందిపై మండిపడ్డారు. ఏకరూపు దుస్తులు ధరించని వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సచివాలయం పనులపై వెళ్లేటప్పుడు కచ్చితంగా రిజిష్టర్‌లో రాసి వెళ్లాలని ఆదేశించారు. మూమెంట్ రిజిష్టర్‌లో తప్పనిసరిగా అవుట్–ఇన్ టైంలు నమోదు చేయాలన్నారు. ప్రతిఒక్కరూ నిర్దేశించిన సమయంలో బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాలని సూచించారు. సి–1 రిజిష్టర్, స్పందన రిజిష్టర్లను కూడా కమిషనర్ పరిశీలించారు. అదేవిధంగా సచివాలయ పరిధిలో ఇంటి పన్ను, కుళాయి పన్నుల వసూలు, పెండింగ్‌లో ఉన్న పన్నులకు సంబంధించిన అంశాలపై సమీక్షించారు. అడ్మిన్ సెక్రటరీని అడిగి వివరాలు తెలుసుకున్నారు. మొండి బకాయిలున్న వారి ఇళ్లకు వెళ్లి మరీ వసూలు చేయాలన్నారు. నిబంధనల ప్రకారం నోటీసులిచ్చి వసూలు చేయాలన్నారు. చెల్లించని వారి కుళాయి కనెక్షన్లు తొలగించాలని ఆదేశించారు. సచివాలయాల పరిధిలో వసూలు చేస్తున్న క్లాప్ యూజర్ ఫీ కలెక్షన్స్ గురించి వాకబు చేశారు. అనంతరం మూడో డివిజన్ కార్పొరేటర్ గండు ధనలక్ష్మి మధుతో కలిసి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. పోతురాజు కాలువ పరిసరాల్లో పర్యటించి పారిశుధ్య పనుల తీరును పరిశీలించారు. సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు.

పెండింగ్ ఆస్తి పన్ను వసూలు చేయాలి...

ఒంగోలు నగరంలో పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్ను, కుళాయి పన్నులను వేగవంతంగా వసూలు చేయాలని వార్డు సచివాలయాల సిబ్బందిని కమిషనర్ వెంకటేశ్వరరావు ఆదేశించారు. స్థానిక కోటవీధి సచివాలయాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బందితో కలిసి ఆస్తి పన్ను, కుళాయి పన్నులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కోటవీధి సచివాలయం పరిధిలో ఉన్న కర్నూలు రోడ్డు కేబీ రెస్టారెంట్‌కు సంబంధించిన ఆస్తి పన్ను రూ.8.36 లక్షలు వసూలు చేశారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. పెండింగ్ పన్నులన్నీ వసూలు చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయిచంద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు దాచూరి మెడికల్ క్యాంపు

ఒంగోలు టౌన్: నగరంలోని డీఆర్ఆర్ఎం హైస్కూల్లో ఈ నెల 5వ తేదీ దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం వారు మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు క్యాంపు కన్వీనర్ మాదాల వెంకటరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మెడికల్ క్యాంపులో బీపీ, షుగర్, మూర్ఛ, పక్షవాతం రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. రెండు నెలలకు సరిపడా మందులను కేవలం రూ.200కే ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రముఖ స్పెషలిస్ట్ వైద్యులు వైద్య సేవలు అందిస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పూర్తి వివరాలకు క్యాంపు నిర్వహణ కమిటీ ఫోన్ నంబర్ 94903 00076ను సంప్రదించాలని కోరారు.

రేపు చదలవాడలో న్యాయ విజ్ఞాన సదస్సు

ఒంగోలు: నాగులుప్పలపాడు మండలం చదలవాడలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నట్లు ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ కె.నటరాజ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరఘునాయకస్వామి ఆలయం వద్ద జరిగే ఈ సదస్సులో ప్రజలకు వివిధ రకాలైన చట్టాలపై, న్యాయాన్ని పొందడానికి అనుసరించాల్సిన విధానాలపై అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. న్యాయ విద్యార్థులు తమ వంతు సామాజిక బాధ్యతగా ఈ న్యాయ విజ్ఞాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారని, అందులో కాలేజీ యాజమాన్యం, కాలేజీ అధ్యాపకులతో పాటు పోలీసు అధికారులు, పలువురు ప్రముఖులు పాల్గొని అవగాహన కల్పిస్తారని అన్నారు. ప్రజలు ఈ శిబిరానికి విచ్చేసి చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని ప్రిన్సిపాల్ నటరాజ్‌కుమార్ కోరారు.

వైభవంగా ధ్వజ స్తంభం ప్రతిష్ట



ధ్వజస్తంభాన్ని ప్రతిష్టిస్తున్న భక్తులు

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని నాగంబొట్లపాలెంలో శ్రీస్వయంభు వీర నరసింహస్వామి వారి జీవ ధ్వజ స్తంభ, విమాన శిఖర ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఉదయం ఏడు గంటల 30 నిమిషాలకు నిత్యవిధులు, గర్తపూజ, రత్నన్యాసం, ధాతున్యాసం కార్యక్రమాల అనంతరం యంత్రస్థాపన, విమాన శిఖర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం వేద పండితుల మంత్రోచ్ఛరణలతో వైభవంగా నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నవధాన్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

నూతన సాంకేతికతపై అప్రమత్తంగా ఉండాలి



శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న అధ్యాపకులు

ఒంగోలు సెంట్రల్: విద్యార్థులు నూతన సాంకేతికతపై ప్రత్యేక శ్రద్ధ వహించి అప్రమత్తంగా ఉండాలని రైజ్ కళాశాల చైర్మన్ శిద్దా వెంకటేశ్వరరావు సూచించారు. రైజ్ కృష్ణసాయి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో శుక్రవారం పీసీబీ డిజైన్‌పై విద్యార్థులకు నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు నేర్చుకున్న విద్యతో భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు. గుంటూరు నరేష్ టెక్నాలజీకి చెందిన డాక్టర్ ఎస్‌వీ నరేష్ విద్యార్థులకు సర్క్యూట్ మాడ్యూల్స్ గురించి వివరించారు. డైరెక్టర్ ఏవీ భాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థులకు యూనివర్సిటీ సిలబస్‌తో పాటు అదనపు సాంకేతికను అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. చైర్మన్ ఇస్కాల చినరంగమన్నార్, ఈసీఈ విభాగాధిపతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో సక్రమంగా పని చేయాలి

- డీఆర్‌డీఏ పీడీ రవికుమార్



సమీక్ష నిర్వహిస్తున్న పీడీ రవికుమార్

కొనకనమిట్ల: వైఎస్సార్ క్రాంతి పథం డీఆర్‌డీఏ ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో పని చేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ తేళ్ల రవికుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు సూచనలు, సలహాలు అందించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు పథకం ద్వారా భారీ యూనిట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రుణాలు సక్రమంగా చెలిస్తున్న సంఘాలకు బ్యాంక్ ద్వారా ఆర్థిక సహకారం అందిస్తామన్నారు. స్త్రీ నిధి రికవరీ, జగనన్న తోడు, పీఎంఈజీపీ లోన్స్, గ్రేడింగ్ మొదలైన వాటిపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ సుధాకర్, ఏపీఎం కె.గోపాలకృష్ణారెడ్డి, సీసీలు యగ్రా, రామయ్య, రాజయ్య, వీఓఏలు, పొదుపు గ్రూపు అకౌంటెంట్లు పాల్గొన్నారు.

ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్‌తో దాణా పంపిణీ



దాణా అందజేస్తున్న అధికారులు

దర్శి: మండలంలోని తూర్పు చౌటపాలెం గ్రామానికి చెందిన మారం సుబ్బారెడ్డి ఆవు పిండాన్ని ఏప్రిల్‌లో ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్ పద్ధతిలో అమర్చారు. దానికి రైతును ప్రోత్సహించేందుకు ఒంగోలు డీఏల్‌డీఏ ఆఫీస్ నుంచి రూ.2500 దాణాను శుక్రవారం ఉచితంగా అందజేశారు. ఆవును జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి బేబిరాణి, డీఎల్‌డీఏ చైర్మన్ కోసూరి రాధ, ఈఓ డాక్టర్ కాలేషా, దర్శి ఏడీ డాక్టర్ పురుషోత్తమరాజు పరీక్షించి అనంతరం దాణా అందజేశారు. జిల్లాలో ఉన్న రైతులు అందరూ ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్ టెక్నాలజీ ఉపయోగించుకుని మంచి దూడలు పొందాలని డాక్టర్ బేబిరాణి కోరారు. ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్ టెక్నాలజిస్ట్ డాక్టర్ బసవయ్యను అభినందించారు. మేలుజాతికి చెందిన ఆవులు, గేదెల పిండాలు రైతులకు అందుబాటులో ఉంచామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎల్‌డీఏ ఈఓ కాలేషా కోరారు.

మద్యం మత్తులో వ్యక్తి మృతి

గిద్దలూరు రూరల్: పట్టణ శివారు మోడంపల్లె క్రాస్ రోడ్డు వద్ద ఓ వ్యక్తి మద్యం తాగి ఫిట్స్ కారణంగా మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ మహేష్ కథనం ప్రకారం.. రాచర్ల మండలం చోళ్లవీడు గ్రామానికి చెందిన సుంకరి కోటయ్య(55) కెఎస్.పల్లెలో తమ బంధువుల వద్దకు వెళ్లి వస్తానని ఇంటి వద్ద చెప్పి మోడంపల్లె క్రాస్ రోడ్డు వద్ద ఓ అరుగుపై కూర్చుని మద్యం తాగాడు. ఇంతలో ఫిట్స్ కారణంగా మృతి చెందాడు. కోటయ్య మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. ఫిట్స్ కారణంగా మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారని ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

రెండు ట్రావెల్స్ బస్సులు ఢీ



ప్రమాదానికి గురైన ట్రావెల్స్ బస్సులు

ఒంగోలు సబర్బన్: నగరంలో శుక్రవారం రాత్రి 10.30 గంటల సమయంలో రెండు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ఢీకొన్నాయి. స్థానిక ప్రసాదరావు ఆస్పత్రి ఎదురుగా ముందువెళ్తున్న ఆరెంజ్ ట్రావెల్స్ బస్సును వెనుక వస్తున్న శ్రీకృష్ణ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ముందు వెళ్తున్న ఆరెంజ్ ట్రావెల్స్ బస్సుకు ద్విచక్రవాహనదారుడు అడ్డంగా రావడంతో డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. వెనుక నుంచి వస్తున్న శ్రీకృష్ణా ట్రావెల్స్ బస్సు వేగంగా వచ్చి ఆరెంజ్ ట్రావెల్స్ బస్సును ఢీకొట్టింది. నెల్లూరు బస్టాండ్ సెంటర్లో వేగపరిమితి 10 కిలోమీటర్లే. అయినా రెండు బస్సులు ఢీకొన్న ప్రమాదం చూస్తే పరిమితికి మించిన వేగంతో బస్సులు ప్రయాణిస్తున్నట్లు అర్థమవుతోంది. ఈ ప్రమాదంలో ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. వన్‌టౌన్ పోలీసులు రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

వృద్ధాశ్రమంలో పింఛన్ అందజేత



వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ అనూరాధ

కొత్తపట్నం: వృద్ధాశ్రమంలో ఉంటున్న ఒంటరి మహిళకు వైఎస్సార్ సామాజిక భద్రతా పెన్షన్‌ను శుక్రవారం వలంటీర్ అందజేశారు. ఒంగోలు నగరంలోని 30వ డివిజన్ గద్దలగుంట-1 వార్డు సచివాలయ పరిధిలోని క్లస్టర్ 21లో భాగమైన సీతారామపురం ఏరియాలో నివసించే ఒంటరి మహిళా పింఛన్ లబ్ధిదారు వడ్డే నళిని జయంతి అకస్మాత్తుగా ఆరోగ్యం క్షీణించి గుంటూరు హాస్పిటల్లో వైద్యం చేయించుకుంది. అనంతరం మోటుమాలలోని శ్రీ భగవాన్ రమణ మహర్షి వృద్ధాశ్రమంలో చేరింది. ఆమెకు ప్రతి నెలా ఇచ్చే పింఛన్‌ను ఈ నెల వార్డు వలంటీర్ పి.అనూరాధ వృద్ధాశ్రమానికి చేరుకుని మరీ అందజేయడంతో వృద్ధురాలు సంతోషం వ్యక్తం చేసి వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలిపింది.

పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలి



రైతులతో మాట్లాడుతున్న ఆత్మ పీడీ అన్నపూర్ణ

నాగులుప్పలపాడు: రైతులు సాగు చేసే పంటల్లో సమగ్ర వ్యవసాయ యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వనరుల కేంద్రం ఆత్మ పీడీ అన్నపూర్ణ సూచించారు. శుక్రవారం మండలంలోని బీ నిడమానూరు గ్రామంలో గల రైతు భరోసా కేంద్రంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యాజమాన్య పద్ధతులైన విత్తనశుద్ధి, పచ్చిరొట్ట ఎరువుల వాడకం, జీవన ఎరువుల వాడకం వంటి అంశాల గురించి రైతులకు వివరించారు. మండల వ్యవసాయాధికారి వెంకట్రావు మాట్లాడుతూ ప్రస్తుత రబీ సీజన్‌లో శనగ పంట సాగు చేసే రైతులకు 40 శాతం రాయితీపై ఒక్కో ఎకరాకు 40 కిలోల వరకు శనగలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి శైలజ, శేషమ్మ, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తానా వేడుకల కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నరసం సభ్యులు

ఒంగోలు మెట్రో: తానా వేడుకల కరపత్రాలను స్థానిక నవ్యాంధ్రరచయితల సంఘం (నరసం) కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ నెల 9వ తేదీ నుంచి తానా వంద దేశాల తెలుగు సంఘాల ఆధ్వర్యంలో అద్భుతమైన కార్యక్రమాలు నిర్వహించనుందని నరసం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ తెలిపారు. అదేరోజు ఆఫ్రికా ఖండంలోని బోట్స్‌వాన దేశంలో అపూర్వ యాత్ర ప్రారంభవుతుందని చెప్పారు. వంద శతక పుస్తకాలు రచించిన శ్రీ చిగురుమళ్ల శ్రీనివాస్ వందే విశ్వమాతరమ్ పేరుతో వంద దేశాలలో శాంతి, సద్భావన యాత్రకు శ్రీకారం చుట్టారని వెల్లడించారు. ప్రపంచ సాహిత్య చరిత్రలో అపూర్వమైన ఘట్టంగా పేర్కొన్నారు. 2023 నుంచి 2025 వరకు కొనసాగనున్న ఈ కార్యక్రమం కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో అరుణతో పాటు నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి, కళామిత్రమండలి జాతీయ లోగిలి అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు, శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్ బాబు, రాష్ట్ర కోశాధికారి అరుణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కత్తి కృపావరం, జిల్లా ఉపాధ్యక్షురాలు సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామర్థ్యపు పరీక్షలు



లింగంగుంట పాఠశాలలో న్యాస్ పరీక్ష పత్రాలు విడుదల చేస్తున్న ఎంఈఓ శ్రీనివాసరావు

మద్దిపాడు: విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరీక్షించడం కోసం భారత ప్రభుత్వం నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (న్యాస్) పరీక్షలను శుక్రవారం ఎంపిక చేసిన పాఠశాలల్లో మూడు, ఆరు, తొమ్మిదో తరగతి విద్యార్థులకు నిర్వహించారు. మండలంలోని పది ఉన్నత పాఠశాలలు, మూడు ప్రాథమికోన్నత పాఠశాలలు, పదమూడు ప్రాథమిక పాఠశాలల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. ఇన్విజిలేటర్లుగా పాఠశాలల ఉపాధ్యాయులను కాకుండా ఇతరులను నియమించారు. ఎంఈఓలు ఎంవీ ఆర్ ఆంజనేయులు, మెడబలిమి శ్రీనివాసరావు, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు వెంకట్రావు, శ్రీనివాసరావు, అంజిరెడ్డి మండలంలోని లింగంగుంట జెడ్పీ హైస్కూల్, మద్దిపాడులోని నారాయణ, నాగార్జున ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో పర్యవేక్షించారు. మూడో తరగతి పరీక్షలకు 203 మంది, ఆరో తరగతి పరీక్షలకు 239 మంది, తొమ్మిదో తరగతి పరీక్షలకు 265 మంది విద్యార్థులు హాజరయ్యారు.

ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ మహిళా వింగ్‌ల ఎంపిక



నూతనంగా ఎంపికైన ఏపీ ఎన్‌జీఓ మహిళా వింగ్ సభ్యులు

ఒంగోలు అర్బన్: స్థానిక ఎన్‌జీఓ హోంలో ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.శరత్‌బాబు, కార్యదర్శి ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా, తాలూకా మహిళా వింగ్‌లను ఏర్పాటు చేశారు. కమిటీలో ఎంపికైన మహిళా ఉద్యోగులు అధ్యక్ష కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపికైన వారిలో వివిధ శాఖల మహిళా ఉద్యోగులు ఉన్నారు. జిల్లా ఉమెన్ వింగ్ చైర్‌పర్సన్‌గా ఆయుష్ శాఖలో పనిచేస్తున్న కె.కోటేశ్వరమ్మ, ఇరిగేషన్ శాఖలోని సీహెచ్ శిరీషా, కో చైర్‌పర్సన్‌గా ఎం.సావిత్రి, వైస్ చైర్‌పర్సన్‌గా ఉదయలక్ష్మి, అశ్వినీకుమారి, పద్మశ్రీ, పి.భారతి, టి.కృష్ణవేణి, స్వరూపరాణి, మాలతి, కళావతి, రాజేశ్వరి, అంజనాదేవి, సుగుణ శోభారాణి, ఎస్కే మెహబూబీ ఉన్నారు. అదేవిధంగా టౌన్ విభాగానికి చైర్‌పర్సన్‌గా ఎస్.జ్యోతి, కన్వీనర్‌గా భాగ్యలక్ష్మి, కో చైర్‌పర్సన్‌గా సంతోషి కుమారి ఎంపికయ్యారు. దీంతో పూర్తి స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన మహిళా కమిటీ తెలిపింది.